సాక్షి
వికారాబాద్
బుధవారం । 23 । జూలై । 2025



వడివడిగా అడుగులు

దుద్యాల్ మండలంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రారిశామికవాడ పనులు ప్రారంభమయ్యాయి.

8లో ▸



'పాలమూరు' పూర్తి చేయాలి

తెలంగాణ నీటి హక్కులను రేవంత్ రెడ్డి ప్రభుత్వం కాలరాస్తోందని బీఆర్ఎస్వీ నేత శుభప్రద్ పటేల్ ఆరోపించారు.

8లో ▸



'స్థానిక' కోలాహలం

త్వరలో స్థానిక ఎన్నికలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంతో గ్రామాల్లో నేతల సందడి మొదలైంది.

9లో ▸

దంచికొట్టిన వాన

తాండూరు పట్టణంలో భారీ వర్షం



తాండూరు టౌన్: జలమయమైన కాలనీ

- 105 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- నీట మునిగిన రోడ్లు, పంటలు
- కొట్టుకుపోతున్న యువకుడిని కాపాడిన స్థానికులు
- ఇళ్లలోకి పాములు
- ముంపు ప్రాంతాలను పరిశీలించిన ఎమ్మెల్యే బీఎమ్మార్



తాండూరు టౌన్: మార్కండేయ కాలనీలోకి చేరిన వరదనీరు



తాండూరు రూరల్: నారాయణపూర్ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న కాగ్నా నది



మెడలోతు నీటిలో వెళ్తున్న వ్యక్తి



తాండూరు రూరల్: ఐనెల్లి గ్రామంలో పంట పొలంలో చేరిన వర్షపు నీరు

తాండూరు టౌన్: తాండూరు పట్టణంలో సోమవారం రాత్రి వర్షం దంచి కొట్టింది. ఏకంగా 105 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది. సుమారు 3 గంటల పాటు ఎడతెరిపి లేకుండా వర్షం పడటంతో ప్రధాన రోడ్లు, లోతట్టు ప్రాంతాలు వరదనీటితో నిండిపోయాయి. పట్టణంలోని శాంతినగర్, సాయిపూర్, మిత్రనగర్, మార్కండేయ కాలనీ, గ్రీన్ సిటీ, పాతకుంట తదితర లోతట్టు ప్రాంతాల్లోని జనావాసాల మధ్య వరదనీరు నిలిచింది. పార్కింగ్ చేసిన వాహనాలు నీట మునిగాయి. మెడలోతు నీటిలో జనాలు ఎలాగోలా ఇళ్లకు చేరుకున్నారు. వరదనీటితో పాటు పాములు సైతం ఇళ్లల్లోకి చేరాయి. సాయిపూర్‌లో ఓ చెట్టు నడిరోడ్డుపై కూలింది. నాపరాయి పాలిషింగ్ యూనిట్లు నీట మునగడంతో ఉత్పత్తి ఆగిపోయింది. తాండూరు – వికారాబాద్ ప్రధాన రహదారి మార్గంలో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వరద నీటిలో బైకుతో పాటు కొట్టుకుపోతున్న యువకున్ని అక్కడే ఉన్న స్థానికులు రక్షించారు. చిలకవాగు ద్వారా వరదనీరు కాగ్నా నదిలో కలవాల్సి ఉండగా, భూకబ్జాదారులు, రియల్ వ్యాపారులు దాన్ని కబ్జా చేయడం వల్లే ఇలాంటి పరిస్థితి ఎదురైందని స్థానికులు తెలిపారు.

ముంపు ప్రాంతాలను పరిశీలించిన ఎమ్మెల్యే

చిలకవాగు కాలువ ఇరుకుగా ఉండటం వల్ల వరదనీరు బయటకు వెళ్లక పలు కాలనీల్లో నీరు నిలుస్తోందని స్థానిక ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి అన్నారు. గ్రీన్‌సిటీ, మార్కండేయ కాలనీ తదితర కాలనీలను మంగళవారం ఆయన పరిశీలించారు. అక్కడి ప్రజలతో మాట్లాడి, సాధ్యమైనంత త్వరలోనే ఈ సమస్యను పరిష్కరిస్తామన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రూ. 16 కోట్లతో చిలకవాగు కాలువ నిర్మాణ పనులు సాగుతున్నాయని, మరో రూ.35 కోట్లు తెచ్చి ఇట్టి పనులను పూర్తి చేయిస్తానన్నారు.



చిలకవాగు కాలువను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బీఎమ్మార్

మండలంలో జోరువాన

తాండూరు రూరల్: మండలంలో సోమవారం రాత్రి భారీ వర్షం కురిసింది. వాగులు, చెరువుల్లో వరదనీరు వచ్చి చేరింది. ఐనెల్లి, జినుగుర్తి, సంకిరెడ్డిపల్లి, కోటబాసుపల్లి, ఉద్దండాపూర్‌తో పాటు తదితర గ్రామాల్లోని పంట పొలాలు నీట మునిగాయి. నారాయణపూర్ శివారులో కాగ్నా నది ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎల్మకన్నె శివారులోని చెక్‌డ్యాం నిండింది. మండలంలో 9 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ తారాసింగ్ తెలిపారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



బైక్‌తోపాటు కొట్టుకుపోతున్న యువకుడిని కాపాడుతున్న స్థానికులు



సాయిపూర్‌లో కూలిన చెట్టు

న్యూస్‌రీల్

రేపు పాలిసెట్ కౌన్సెలింగ్

అనంతగిరి: ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల్లో చివరి దశ ప్రవేశాల కోసం గురువారం కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ రవీందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీజీ పాలిసెట్ –2025లో అర్హత పొందిన అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు వికారాబాద్ సమీపంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు రావాలని సూచించారు. ముందుగా కౌన్సెలింగ్ ఫీజు చెల్లించి, బుధవారం స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు. ఒరిజినల్స్, రెండు సెట్ల జిరాక్స్ కాపీలతో హాజరుకావాలన్నారు.

నేరాల నియంత్రణకు కృషి చేయాలి

ఎస్పీ నారాయణరెడ్డి



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి

పూడూరు: పోలీసులు ప్రజల పట్ల స్నేహభావంతో మెలిగి, నేరాల అదుపునకు కృషి చేయాలని ఎస్పీ నారాయణరెడ్డి సూచించారు. మంగళవారం చన్గోముల్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. ఈ పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రమాదాలు తగ్గాయని తెలిపారు. ఎస్పీ వెంట పరిగి డీఎస్పీ శ్రీనివాస్, సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐ భరత్‌రెడ్డి ఉన్నారు.

తండ్రి మృతి.. తల్లి జైలుకు..

అనాథలుగా మారిన చిన్నారులు



ఈశ్వర్, సుకుమార్

తాండూరు రూరల్: నిన్నటి వరకు తల్లి దండ్రులతో అప్యాయంగా గడిపిన ఆ చిన్నారులు నేడు అనాథలుగా మారారు. తండ్రి హత్యకు గురికాగా ఈ కేసులో తల్లి జైలుకు వెళ్లింది. దీంతో చిన్నారుల ఆలనాపాలన చూసేవారు కరువయ్యారు. వివరాలు ఇలా ఉన్నాయి. తాండూరు మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన రెడ్డిపల్లి వెంకటేశ్(33), జయశ్రీ దంపతులు. వీరికి ఇద్దరు పిల్లలు ఈశ్వర్ ప్రసాద్, సుకుమార్ ఉన్నారు. వీరు స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. ఆదివారం రాత్రి భర్త వెంకటేశ్‌ను భార్య జయశ్రీ హత్య చేసింది. పోలీసులు ఆమె అరెస్టు చేసి జైలుకు తరలించారు. దీంతో పిల్లలు అనాథలుగా మారారు. ప్రస్తుతం పెద్ద నాన్న, పెద్దమ్మ సమక్షంలో ఉంటున్నారు. ప్రభుత్వం ఆర్థిక సహాయం చేసి చిన్నారులను ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రైవేటు ఆస్పత్రులపై దాడులను సహించం

సీఐ శ్రీనివాస్‌రెడ్డి హెచ్చరిక



మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్‌రెడ్డి

పరిగి: ప్రైవేటు ఆస్పత్రులపై దాడులు చేస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ శ్రీనివాస్‌రెడ్డి హెచ్చరించారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రైవేటు ఆస్పత్రుల విషయంలో ఏవైనా ఇబ్బందులు ఉంటే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం దాడులకు పాల్పడితే సహించేది లేదన్నారు. ఇదిలా ఉండగా నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న ఆస్పత్రులు, నకిలీ వైద్యులపై చర్యలు తీసుకోవాల్సిన పోలీసులే వారికి మద్దతుగా మాట్లాడటం విడ్డూరంగా ఉందని బాధితులు, ప్రజా సంఘాల నాయకులు మండిపడ్డారు.

కేజీబీవీలో బోనాల సందడి



బోనాలతో విద్యార్థినులు, ఉపాధ్యాయులు

తాండూరు రూరల్: మండలంలోని ఐనెల్లి కేజీబీవీలో బోనాల పండుగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు సంప్రదాయ దుస్తులు ధరించి నెత్తిన బోనాలతో ఊరేగారు. కొందరు అమ్మవారి వేషధారణ, శివసత్తుల నృత్యాలు ఆకట్టుకున్నాయి.

'సీజనల్'పై నిర్లక్ష్యం వద్దు



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

- అంటువ్యాధులు ప్రబలకుండా చూడాలి
- కలెక్టర్ ప్రతీక్ జైన్

అనంతగిరి: జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో వ్యవసాయ, ఆరోగ్యం, ఇందిరమ్మ ఇళ్లు, శానిటేషన్ తదితరల అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వసతి గృహాలు, గురుకులాల్లో తాగునీరు కలుషితం కాకుండా చూసుకోవాలన్నారు. నాణ్యమైన సరుకులతో వంట తయారు చేసి విద్యార్థులకు వేడివేడిగా అందించాలని ఆదేశించారు. పాఠశాలలు, కళాశాలల్లో పరిశుభ్రత పాటించాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ఎక్కడా సమస్యలు లేకుండా చూసుకోవాలని తెలిపారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని మున్సిపల్ కమిషనర్లకు సూచించారు. జిల్లాలోని అన్ని ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి స్టాక్ వివరాలు బోర్డులో ఉండేలా చూడాలన్నారు. అన్ని షాపుల్లో యూరియా అందుబాటులో ఉందని, రైతులు దొడ్డు యూరియా వాడేలా అవగాహన కలిపించాలన్నారు. పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్, డీపీఓ జయసుధ, వైద్యశాఖ జిల్లా అధికారి లలితాదేవి, వ్యవసాయ శాఖ అధికారి రాజారత్నం, మున్సిపల్ కమిషనర్లు, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు పథకాలు అందాలి

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన పేదలందరికీ అందాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. మంగళవారం నగరం నుంచి మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్, కొండా సురేఖ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. భూభారతి చట్టం, ఇందిరమ్మ ఇళ్లు, వర్షాలపై పలు సూచనలు చేశారు. అనంతరం కలెక్టర్ అధికారులతో సమావేశం నిర్వహించారు. పలు అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ హర్ష్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో గంజాయి జోరు

దోమ: మండల కేంద్రంలో గంజాయి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఇందుకు సంబంధించిన వీడియోలు మంగళవారం స్థానిక సోషల్ మీడియాలో జోరుగా ప్రచారమయ్యాయి. యువత, విద్యార్థులే లక్ష్యంగా ఈ దందా కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. చిన్న చిన్న ప్లాస్టిక్ ప్యాకెట్లలో గంజాయి నింపి గుట్టుగా విక్రయిస్తున్నారు. ఈ కేసులతో సంబంధం ఉన్నవారిని పోలీసులు అరెస్టు చేస్తున్నా దందాకు అడ్డుకట్ట పడటం లేదు. పరిస్థితి ఇలాగే ఉంటే యువత జీవితాలు నాశనం కావడంతో పాటు కుటుంబాలు వీధిన పడతాయని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసు ఉన్నతాధికారులు స్పందించి, గంజాయి, గుట్కా, డ్రగ్స్‌ను నియంత్రించాలని కోరుతున్నారు.

కనుల పండువగా పవిత్రోత్సవం

సుగంధ ద్రవ్యాలతో పూర్ణాహుతి



హోమాలు నిర్వహిస్తున్న అర్చకులు

కొడంగల్: పట్టణంలోని బాలాజీనగర్‌లో వెలసిన పద్మావతీ సమేత శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం పవిత్రోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. నిత్య కైంకర్యాల్లో మంత్ర లోపం, క్రియాలోపం, ద్రవ్యలోపం దోష నివారణ కోసం పవిత్రోత్సవాలను మూడు రోజుల నుంచి నిర్వహిస్తున్నారు. అపవిత్ర హరణం.. పవిత్రోత్సవం అంటూ అర్చకులు తెలిపారు. టీటీడీ అర్చకులు వేద మంత్రోచ్చరణాలతో హోమాలు నిర్వహించారు. వేలాది మంది భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్ పర్సన్ కల్వ సుజాత, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి విశేష హోమాలు, పవిత్రోత్సవం, పూర్ణాహుతి, కుంభ బింబ ప్రదక్షిణం, ప్రోక్షణ, అక్షతారోపణం, అర్చక బహుమానం తదితర కార్యక్రమాలు చేపట్టారు. శ్రీవారి ఆలయంలో మూలమూర్తికి అష్టోత్తర శత అష్టదళ పద్మారాధన వంటి పూజలు చేశారు. అనంతరం హోమ గుండంలో సుగంధ ద్రవ్యాలను వేసి పూర్ణాహుతి నిర్వహించారు. రాత్రి కలెక్టర్ ప్రతీక్ జైన్ స్వామివారిని దర్శించుకున్నారు.

బడికో సారు.. కావాలి ఇలాంటి వారు

- స్కూల్ రూపురేఖలు మార్చిన ఉపాధ్యాయుడు
- సొంత డబ్బులతో వసతుల కల్పన
- గతేడాది 8మంది.. ఈసారి 36 మంది విద్యార్థులు
- అడాల్‌పూర్ ప్రాథమిక పాఠశాలలో ప్రైవేటు స్కూళ్లకు దీటుగా బోధన



ఉదయం ప్రార్థన సమయంలో హాజరైన విద్యార్థులు

యాలాల: మనసు పెట్టి ప్రయత్నిస్తే అసాధ్యమనుకున్న పనులు సైతం సుసాధ్యమేనని నిరూపించారు ఓ ఉపాధ్యాయుడు. ఏడాది క్రితం బదిలీపై ఓ మారుమూల గ్రామానికి వెళ్లిన ఆయన అక్కడి పరిస్థితులను చూసి కలత చెందారు. అందరిలా అక్కడే ఆగిపోకుండా.. తనవంతు కర్తవ్య దీక్షను ప్రారంభించారు. ఏడాది కాలంలోనే అద్భుతమైన ఫలితాలు రాబట్టి, అందరి మన్ననలు పొందుతున్నారు.

ట్యాబ్‌లతో బోధన

మండలంలోని అడాల్‌పూర్ ప్రాథమిక పాఠశాలలో గతేడాది 1 నుంచి 5 తరగతులకు కేవలం 8 మంది విద్యార్థులు మాత్రమే ఉండేవారు. ఈ సమయంలో బదిలీపై వచ్చిన ఎర్రని శ్రీనివాస్ విధుల్లో చేరారు. ఆ క్షణం నుంచే బడి బాగుకోసం అడుగులు వేయడం ప్రారంభించారు. వెంటనే తల్లిదండ్రులు, నాయకులు, యువకులతో సమావేశం నిర్వహించి చదువు ప్రాధాన్యతను వివరించారు. విద్యాభివృద్ధికి సహకరించాలని కోరారు. స్కూల్‌లో స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులు ప్రారంభించారు. ట్యాబ్‌లను వినియోగించి బోధన, నాణ్యమైన భోజనం అందేలా చర్యలు తీసుకున్నారు. తన సొంత డబ్బులు వెచ్చించి విద్యార్థులకు డ్యుయెల్ డెస్కులు, టేబుళ్లు, ర్యాక్‌లు తెప్పించారు. తాగునీరు, మరుగుదొడ్లు వంటి వసతులు కల్పించి, టైలు, బెల్టులు అందజేశారు. పాఠశాల ఆవరణలో మొక్కల పెంపకం, భవనానికి రంగులు వేయడం వంటి మార్పులు చేశారు. ఆయన కృషి ఫలితంగా తమ పిల్లలు ఇంగ్లిష్ పదాలు మాట్లాడటం, చదువుపై శ్రద్ధ చూపడాన్ని గమనించిన తల్లిదండ్రులు, స్థానికులు మిగిలినవారిని సైతం సర్కారు బడి బాట పట్టించారు. ఇలా ఏడాది క్రితం 8 మంది విద్యార్థులున్న ఈ పాఠశాలలో వీరి సంఖ్య 41కి చేరింది. వీరిలో 16మంది ప్రైవేటు స్కూళ్లనుంచి వచ్చిన వారు కావడం గమనార్హం. 41 మందిలో ఇటీవల ఐదుగురు విద్యార్థులు గురుకులాల్లో సీట్లు సాధించి వెళ్లిపోయారు.

ఇద్దరు విద్యార్థుల దత్తత

గ్రామానికి చెందిన నందిని, నవ్యశ్రీ అనే విద్యార్థుల తల్లి చనిపోవడంతో మిగిలిన కుటుంబ సభ్యులు చిన్నారుల చదువుపై శ్రద్ధ చూపలేకపోయారు. ఇది గుర్తించిన ఉపాధ్యాయుడు శ్రీనివాస్ గ్రామస్తుల చొరవతో వారిని దత్తత తీసుకున్నారు. వారికి అవసరమైన ఖర్చులను భరిస్తున్నారు. తల్లిలేని పిల్లలకు గురుకులంలో సీటు వచ్చే వరకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని చదివిస్తానని చెబుతున్నారు.

చాలా మార్పు వచ్చింది



గతేడాది శ్రీనివాస్ సార్ విధుల్లో చేరిన తర్వాత పిల్లల చదువులో చాలా మార్పు వచ్చింది. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టి పెడుతున్నారు. ఇప్పటికే చాలా మంది విద్యార్థులు ప్రైవేట్ స్కూళ్లు వీడి ప్రభుత్వ పాఠశాలకు వచ్చారు.

– దోరేటి రాములు, స్థానికుడు

నమ్మకం ఇవ్వగలగాలి



ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందనే నమ్మకం ఇవ్వగలిగితే తల్లిదండ్రులు వారి పిల్లలను ప్రైవేటు స్కూళ్లకు పంపరు. నేను ఇక్కడ విధుల్లో చేరినప్పటి పరిస్థితులు.. ప్రస్తుత మార్పు సంతృప్తినిస్తోంది.

– ఎర్రని శ్రీనివాస్, ఉపాధ్యాయుడు

దివ్యాంగులకు శ్రీవారి ఉచిత దర్శనం

- శ్రీ అష్టోత్తర శత చుక్కల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 66మందికి అవకాశం



మాట్లాడుతున్న వేణుకుమార్

కొడంగల్: శ్రీ అష్టోత్తర శత చుక్కల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏటా దివ్యాంగులకు ఉచితంగా తిరుమల తిరుపతి శ్రీవారి దర్శన భాగ్యం కల్పిస్తున్నట్లు ట్రస్టు ఫౌండర్ చైర్మన్ డాక్టర్ వేణుకుమార్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్ పర్సన్ కల్వ సుజాతతో కలిసి మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. పదేళ్లుగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర నుంచి దివ్యాంగులను తిరుమలకు తీసుకెళ్తున్నట్లు చెప్పారు. ఈ సంవత్సరం సెప్టెంబర్ 9న స్వామివారి దర్శనానికి తీసుకెళ్తున్నట్లు చెప్పారు. కొడంగల్, బొంరాస్‌పేట, దౌల్తాబాద్ మండలాల నుంచి 66 మందికి ఈ అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో కొడంగల్, ఏపీలో కుప్పం, మంగళగిరి, పిఠాపురం తదితర నియోజకవర్గాల నుంచి దివ్యాంగులకు అవకాశం కల్పించినట్లు చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ సెప్టెంబర్ 9న జెండా ఊపి యాత్రను ప్రారంభిస్తారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్, విశ్రాంత ఉపాధ్యాయుడు హన్మయ్య, నందారం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అమ్మ ఆశీస్సులే బలం

- హెచ్ఎం క్రాంతికుమార్
- అమ్మకు వందనంలో విద్యార్థుల ప్రతిజ్ఞ


అమ్మకు వందనంలో పాఠశాల సిబ్బంది

కొడంగల్ రూరల్: విద్యార్థులకు అమ్మ ఆశీస్సులే బలమని హెచ్ఎం క్రాంతికుమార్ పేర్కొన్నారు. మంగళవారం హస్నేన్‌పూర్ ప్రాథమిక పాఠశాలలో అమ్మకు వందనం ఘనంగా నిర్వహించారు. అనంతరం పాఠశాల హెచ్ఎం క్రాంతికుమార్ విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. అమ్మా నేర్పిన ప్రవర్తనే వ్యక్తిత్వానికి పునాది, ఆమె ఆశీర్వాదమే బలం, తోటి వారితో సోదరభావంతో మెలుగుతానని, పెద్దలను, గురువులను గౌరవిస్తానని, సమాజం, దేశం పట్ల భక్తితో నడుచుకుంటానని, నువ్వు పడిన కష్టాన్ని ప్రతీ క్షణం గుర్తుంచుకుంటానని అమ్మసాక్షిగా ప్రమాణం చేస్తున్నానని ప్రతిజ్ఞ చేయించారు. అంతకుముందు విద్యార్థులు వారి 'అమ్మ' పాదాలకు నమస్కరించారు. అనంతరం హెచ్ఎం మాట్లాడుతూ విద్యార్థి దశ ఎంతో కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయిని సంధ్య తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తాం

సాక్షి ఎఫెక్ట్..

బొంరాస్‌పేట: 'కళ్లు'తెరిస్తే మేలు శీర్షికతో మంగళవారం ప్రచురితమైన సాక్షి కథనానికి జిల్లా విద్యాధికారి రేణుకాదేవి స్పందించారు. చిన్నారులు, విద్యార్థులతో మత్తు పదార్థాలు, మద్యం, కల్లు వంటివి తెప్పించడం బాధాకరమన్నారు. ఈ విషయమై తల్లిదండ్రులకు అవగాహన కల్పించేందుకు తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. పాఠశాలల్లో నిర్వహించే పేరెంట్స్, టీచర్స్ సమావేశాలు, ఏపీసీ మీటింగ్‌లలో ఈ అంశాలను చర్చిస్తామని స్పష్టంచేశారు.

దొంగలున్నారని చెప్పి.. దోచుకెళ్లాడు!

మర్పల్లి: 'అమ్మా.. సంతలో దొంగలున్నారు.. మెడలోని బంగారు ఆభరణాలు జాగ్రత్తగా ఉంచుకోండి' అని మాయమాటలు చెప్పిన ఓ కేటుగాడు వృద్ధురాలిని బురిడీ కొట్టించి నగలను అపహరించాడు. ఈ సంఘటన మండల కేంద్రంలో మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసులు, బాధితురాలి వివరాల ప్రకారం.. కోత్లాపూర్ గ్రామానికి చెందిన మొక్కగొల కమలమ్మ(70) మర్పల్లి సంతలో కూరగాయలు కొనుగోలు చేసేందుకు వచ్చింది. అక్కడే ఉన్న ఓ దుండగుడు ఆమెను గమనించి మాటలు కలిపాడు. సమీపంలో పాస్ట్ ఫుడ్ సెంటర్‌లోని తీసుకెళ్లి ఎగ్ ఫ్రైడ్ తినిపించాడు. ఈ క్రమంలో దొంగలు తిరుగుతున్నారు.. నగలు జాగ్రత్తగా చేతి సంచిలో వేసుకోమని వృద్ధురాలికి సూచించాడు. ఈ మాటలు నమ్మిన ఆమె మెడలోని బంగారు గుండ్లను తీసి కవర్లో వేయమని సదరు వ్యక్తికి ఇచ్చింది. ఇదే అదునుగా భావించిన కేటుగాడు బంగారు గుండ్ల స్థానంలో శనగలు వేసి ఇచ్చి వెళ్లిపోయాడు. కాసేపటికీ గమనించిన కమలమ్మ బోరున విలపిస్తూ పోలీసులను ఆశ్రయించింది. ఇదిలా ఉండగా సంతలో మరో ఇద్దరి సెల్ ఫోన్స్ చోరీ అయ్యాయి. ఈ మేరకు కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వడివడిగా అడుగులు

పారిశ్రామికవాడ పనులు వేగవంతం

- ప్రహరీ నిర్మాణం కోసం హద్దుల గుర్తింపు
- యంత్రాలు, కూలీలను సిద్ధం చేసిన అధికారులు


పారిశ్రామికవాడ ప్రహరీ నిర్మాణ పనులకు సిద్ధంగా యంత్రాలు


పనుల కోసం వచ్చిన కూలీలు

దుద్యాల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్న ప్రారిశామికవాడకు వడివడిగా అడుగులు పడుతున్నాయి. మండల పరిధిలోని హకీంపేట్, లగచర్ల, పోలేపల్లి రెవెన్యూ గ్రామాల పరిధిలో నిర్మించనున్న మల్టీపర్పస్ ఇండస్ట్రియల్ కంపెనీ పనులను అధికారులు వేగవంతం చేశారు. రైతుల నుంచి సేకరించిన భూములకు సంబంధించి హద్దులను ఇటీవల నిర్ధారణ చేశారు. ఆ భూములకు ప్రహరీ నిర్మించే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే దాదాపు 970 ఎకరాల వరకు అన్నదాతలు భూములు అందించారు. వాటికి పరిహారం సైతం పొందారు. సేకరించిన భూములకు రక్షణగా గోడను నిర్మించాలని అధికారులు భావిస్తున్నారు. ఇందుకుగాను హకీంపేట్ శివారులో పనులు జరిపేందుకు యంత్రాలు సైతం చేరుకున్నాయి. ఇతర రాష్ట్రాల నుంచి పనులు చేయడానికి కూలీలు వచ్చారు. ఇంకా 200 పైచిలుకు ఎకరాల భూమి రావాల్సి ఉండడంతో కంపెనీలకు కేటాయింపులో ఆలస్యం జరుగుతుందనే సమాచారం ప్రాథమికంగా అందుతోంది.

అధికారుల పరిశీలన

పారిశ్రామికవాడ ఏర్పాటు కోసం సేకరించిన భూములకు సంబంధించి ప్రహరీ నిర్మించేందుకు ప్రభుత్వం సిద్ధమవ్వడంతో పరిశీలనకు అధికారులు క్యూ కట్టారు. ఇటీవల తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాలసంస్థ(టీజీఐఐసీ) అధికారులు భూములను పరిశీలించి హద్దులు నిర్ధారణ చేశారు. అలాగే రెండు రోజుల క్రితం తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, తహసీల్దార్లు పరిశీలించారు. ఇలా అధికారులు ఎప్పటికప్పుడు పారిశ్రామికవాడ ఏర్పాటుకు పనుల్లో వేగం పెంచారని స్థానికులు తెలుపుతున్నారు. బండరాళ్లను తొలగించడానికి పొక్లెయిన్లు, లారీలు తదితర యంత్రాలను ఇప్పటికే సిద్ధంగా ఉంచారు.

సేకరించిన భూముల వివరాలు

పారిశ్రామికవాడ ఏర్పాటుకు మొత్తం 1,177.35 ఎకరాల భూ సేకరణను అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. కాగా పోలేపల్లి గ్రామంలో 38 మందికి సంబంధించిన అసైన్డ్ భూమి 73.39 ఎకరాలు, అదనంగా 48 ఎకరాల ప్రభుత్వ భూమిని కూడా స్వాధీనం చేసుకున్నారు. హకీంపేట్ గ్రామంలో 172 మంది రైతులకు సంబంధించి అసైన్డ్ భూమి 261.33 ఎకరాలు, పట్టా భూమి 143.21 ఎకరాలను సేకరించారు. లగచర్ల రెవెన్యూ గ్రామం పరిధిలో 64 మంది రైతుల 72.26 ఎకరాల అసైన్డ్ ల్యాండ్, 212 మందికి సంబంధించి 314.13 ఎకరాల పట్టా ల్యాండ్‌ను తీసుకున్నారు. అయితే అధికారులు 912.12 ఎకరాల భూమిని సేకరించారు. ఇంకా 263.23 ఎకరాలు సేకరించాల్సి ఉంది.

మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి


మహిళా సంఘాల సభ్యులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి: రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పట్టణానికి చెందిన మహిళా సంఘాల సభ్యులకు రూ.1.5 కోట్ల బ్యాంకు లింకేజ్ రుణాల చెక్కును, రేషన్ కార్డులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వ్యాపారాలను మహిళల ద్వారా నిర్వహించి వారిని అన్ని రంగాల్లో ప్రోత్సహించే విధంగా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలను ఇచ్చి వ్యాపార రంగంలో రాణించేలా చేస్తుందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం, రూ.500లకే వంట గ్యాస్, ఉచిత విద్యుత్ సరఫరా.. ఇలా ఎన్నో పథకాలను ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే ఇల్లు బాగుటుందన్నారు. ఇందిరమ్మ క్యాంటీన్లు, మహిళల పేరిట పెట్రోల్ బంకులు, మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్సులు నడిపే విధంగా ప్రభుత్వం అవకాశం ఇచ్చిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఒక్కరికీ సైతం రేషన్ కార్డు ఇవ్వలేదన్నారు. ప్రస్తుతం అర్హులైన ప్రతిఒక్కరూ రేషన్ కార్డు కోసం దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి కృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాంరెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, ప్రధాన కార్యదర్శి హన్మంతు ముదిరాజ్, ఏ బ్లాక్ అధ్యక్షుడు పార్థసారథి, తహసీల్దార్ వెంకటేశ్వరి, మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య, అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చోరీకి పాల్పడిన ముగ్గురి అరెస్టు

మొయినాబాద్: తాళం వేసిన ఇంట్లో చోరీకి పాల్పడి బంగారం, నగదు దోచుకెళ్లిన దొంగలను రాజేంద్రనగర్ సీసీఎస్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని అజీజ్‌నగర్‌కు చెందిన బొర్ర జంగయ్య ఇంట్లో ఈ నెల 17న చోరీ జరిగింది. 16న బోనాల పండుగ సందర్భంగా ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి అమీర్‌గూడలో ఉండే తన అక్క ఇంటికి వెళ్లారు. 17న సాయంత్రం ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటి తాళాలు, రెండు బీరువాల తాళాలు పగులగొట్టి 9 తులాల బంగారు నగలు, రూ.3.70 లక్షల నగదు దోచుకెళ్లారు. కేసు నమోదు చేసి దర్యాప్తు మొదలు పెట్టిన పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలించారు. సీసీ టీవీ ఫుటేజీల ఆధారంగా మంగళవారం రాజేంద్రనగర్ సీసీఎస్ పోలీసులు కాళీమందిర్ సమీపంలో ముగ్గురు అనుమానితులు మియాపూర్‌కు చెందిన షేక్ అబ్బు తలీబ్ అలియాస్ ఫైజాన్, అబ్దుల్ రియాజ్ అలియాస్ డాన్, మెహదీపట్నం రేతిబౌలికి చెందిన షేక్ ఉస్మాన్ అలియాస్ సైఫ్‌లను అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించడంతో సంగారెడ్డిలో ఆటో దొంగిలించి, మణికొండలో తాళం వేసిన ఇంట్లో దొంగతనం చేసిన తరువాత మొయినాబాద్‌లోని అజీజ్‌నగర్‌లో దొంగతనం చేసినట్లు అంగీకరించారు. వారి వద్ద 10 తులాల బంగారు ఆభరణాలు, 80 తులాల వెండి ఆభరణాలు, రూ.3.26 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

బైండోవర్ చేసిన వ్యక్తికి రూ.లక్ష జరిమానా

శంకర్‌పల్లి: అక్రమంగా మద్యం విక్రయిస్తూ పట్టుబడిన ఓ వ్యక్తిపై చేవెళ్ల ఎక్సైజ్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీలత తెలిపిన వివరాల ప్రకారం.. శంకర్‌పల్లి మండలం మోకిలలో ముక్తార్ అలీ కేకే దాబా నిర్వహిస్తున్నాడు. ఇక్కడ అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారనే సమాచారంతో గత నెల ఎక్సైజ్ పోలీసులు దాడులు చేసి, ముక్తార్ అలీపై కేసు నమోదు చేసి బైండోవర్ చేశారు. అతను బైండోవర్‌లో ఉంటూ మళ్లీ దాబాలో మద్యం విక్రయాలు ప్రారంభించారు. దీంతో దాడులు చేసి మళ్లీ కేసు నమోదు చేశారు. బైండోవర్‌లో ఉన్న వ్యక్తి మళ్లీ అదే తప్పు చేయడంతో శంకర్‌పల్లి తహసీల్దార్ సురేందర్ వారం రోజుల గడువు ఇచ్చి, రూ.లక్ష జరిమానా ముక్తార్ అలీకి విధించారు. దీంతో అతడు మంగళవారం జరిమానా చెల్లించారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి


యాలాల: లబ్ధిదారులకు మంజూరైన రేషన్‌కార్డు పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

యాలాల: అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తామని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారులకు మంజూరైన నూతన రేషన్‌కార్డులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో కొత్తగా రేషన్‌కార్డులు మంజూరు కాలేదన్నారు. మండలంలో కొత్తగా 877 కొత్త రేషన్‌కార్డులు మంజూరైన లబ్ధిదారులకు పత్రాలు అందించామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మరో రెండు పథకాలను త్వరలో అమలు చేస్తుందన్నారు. నిరుపేద మహిళలకు నెలకు రూ.2500, పింఛన్లు రూ.4వేలు పెంచేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మండలానికి చెందిన 54 మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. రూ.54.6లక్షల విలువ గల చెక్కులను అధికారుల సమక్షంలో లబ్ధిదారులకు అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటస్వామి, డీటీ కిరణ్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ బాల్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ సురేందర్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి, నాయకులు వీరేశం, అనిల్‌కుమార్, హన్మంతు, భీమప్ప, మధుసూదన్‌రెడ్డి,అక్బర్‌బాబా, రాజు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అభివృద్ధి పనులు

బషీరాబాద్: మండల కేంద్రంలో లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులను ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ .. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాల అమలు చేస్తుందన్నారు. బషీరాబాద్ మండలంలో 20 నెలల్లో రూ.300 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని వివరించారు. రాబోయే మూడేళ్లలో తాండూరును అభివృద్ధిలో ఆదర్శంగా నిలుపుతానని చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మాధవరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్రాంరెడ్డి, వైస్ చైర్మన్ అజయ్ ప్రసాద్, ఏఎంసీ వైస్ చైర్మన్ చందర్‌నాయక్, నాయకులు వెంకటేష్ మహారాజ్, శంకర్‌రెడ్డి, నర్సింలు, రామ్‌నాయక్, శాంతి, తహసీల్దార్ షాహెదా బేగం, ఎంపీడీఓ స్వామి తదితరులు పాల్గొన్నారు.

యూరియాకు ఇండెంట్ పంపించాం

సాక్షి ఎఫెక్ట్..

ధారూరు: యూరియా పాట్లు శీర్షికతో సోమవారం సాక్షిలో వచ్చిన వార్తకు ధారూరు మండల వ్యవసాయ అధికారి సూర్యప్రకాశ్ మంగళవారం స్పందించారు. రైతులకు అవసరమైన యూరియా కోసం ఇండెంట్ పంపించామని, బుధవారం స్టాక్ వస్తుందని చెప్పారు. ధారూరు, హరిదాస్‌పల్లి పీఏసీఎస్‌లకు 500 బస్తాల చొప్పున, మోమిన్‌ఖుర్దులోని ఆగ్రో సెంటర్‌కు 560 బస్తాల యూరియా అవసరమని ఇండెంట్ పంపిచామని వివరించారు. ప్రస్తుతం ధారూరులోని మన గ్రోమోర్ షాప్‌లో 437 బస్తాల యూరియా అందుబాటులో ఉందన్నారు.

ఎందుకీ పక్షపాతం..

మండలంలోని హరిదాస్‌పల్లి పీఏసీఎస్ కింద కేవలం రెండు గ్రామాలు మాత్రమే ఉన్నాయి. ధారూరు పీఏసీఎస్ పరిధిలో ఏకంగా 42 గ్రామాలున్నాయి. రెండు గ్రామాలున్న పీఏసీఎస్‌కు ఒకేలారీ, 42 గ్రామాలు, వేలాది మంది రైతులున్న పీఏసీఎస్‌కు ఒకే లారీ కావాలని ఇండెంట్ పంపించడంలో ఆంతర్యం ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. హరిదాస్‌పల్లి పీఏసీఎస్‌లోని రైతులకు యూరియా పెద్దగా అవసరం లేకపోవడంతో బ్లాక్ చేసి, ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారని ఆరోపించారు. ధారూరు పీఏసీఎస్‌కు 5వేల బస్తాల యూరియా అవసరమని పేర్కొన్నారు. యూరియా కోసం మంగళవారం వందలాదిగా ధారూరు పీఏసీఎస్‌కు తరలివచ్చిన రైతులు ఉసూరుమంటూ వెళ్లిపోయారు.

రేషన్ వెలుగులు

- ఏళ్ల ఎదురుచూపులకు నిరీక్షణ
- ఆనందం వ్యక్తం చేస్తున్న పేద కుటుంబాలు
- నిరంతర ప్రక్రియ అంటున్న అధికారులు


తహసీల్దారు కార్యాలయానికి దరఖాస్తు చేసుకోవడానికి వచ్చిన లబ్ధిదారులు


నూతన కార్డులు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు (ఫైల్)

దౌల్తాబాద్: రాష్ట్ర ప్రభుత్వం రేషన్‌కార్డులు జారీ చేయడంతో పేదల జీవితాల్లో నూతన అధ్యాయం లభించినట్లు అయింది. గత సర్కారు హయాంలో కొత్త రేషన్‌కార్డులను జారీ చేయకపోవడం పాత కార్డుల్లో మార్పులు చేర్పులు, కొత్త వారి పేర్ల నమోదుకు లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త కార్డుల జారీకి పేర్ల నమోదుకు అవకాశం కల్పించింది. దీంతో మండలంలో మూడు నెలలుగా నూతన రేషన్‌కార్డుల జారీ ప్రక్రియ వేగంగా సాగుతోంది. మండలంలో 33 రేషన్ దుకాణాల్లో కొత్తగా 260 కార్డులు మంజూరవ్వగా మూడు నెలల నుంచి వందలమంది అదనంగా కార్డుల్లో పేర్లు నమోదు చేసుకున్నారు.

దరఖాస్తుల వెల్లువ

ప్రజాపాలన కార్యక్రమంలో రేషన్‌కార్డులకు దరఖాస్తు వారితో పాటు మీసేవ కేంద్రాల్లో అర్జీ చేసుకున్న వారికి నూతన కార్డులు జారీ అవుతున్నాయి. కుటుంబాల్లో కొత్తగా పుట్టిన వారిని అదనపు సభ్యులుగా చేర్చుతున్నారు. రెవెన్యూ కార్యాలయ సిబ్బంది క్షేత్రస్థాయిలో విచారించిన తర్వాత తహసీల్దారు ఆమోదంతో జిల్లా పౌరసరఫరాల శాఖకు పంపిస్తున్నారు. చివరగా డీఎస్ఓ కార్యాలయంలో కార్డులను ఆమోదిస్తున్నారు. కొన్ని నెలలుగా ప్రభుత్వం రేషన్‌దుకాణాల ద్వారా సన్న బియ్యాన్ని పంపిణీ చేయడంతో పాటు ఆరోగ్య శ్రీ, ఇతర ప్రభుత్వ పథకాలకు రేషన్‌కార్డులను ప్రామాణికం చేయడంతో వాటి కోసం ప్రజలు దరఖాస్తు చేసుకుంటున్నారు.

రేషన్‌షాపుల వద్ద బారులు

రేషన్‌షాపుల్లో ఉచితంగా సన్నబియ్యం పంపిణీ చేస్తుండడంతో లబ్ధిదారులు దుకాణాల వద్ద బారులు తీరుతున్నారు. బహిరంగ మార్కెట్లో కిలో సన్నబియ్యం రూ.40కి పైగానే ఉండడంతో రేషన్ షాపుల్లో బియ్యం తీసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. గతంలో దొడ్డు బియ్యం పంపిణీ సమయంలో చాలా మంది లబ్ధిదారులు బియ్యం తీసుకోకపోవడంతో దందా సాగింది. ప్రస్తుతం సన్నబియ్యం పంపిణీతో దందాకు అడ్డుకట్ట పడినట్లు అయింది. మరోపక్క రేషన్‌కార్డులు జారీ చేస్తుండడంతో నిరుపేదలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కొత్త రేషన్ కార్డులను ప్రభుత్వం నిరంతర ప్రక్రియగా మార్చడంతో అర్హులైన వారందరికీ కార్డులు జారీ చేస్తున్నామని జిల్లా పౌరసరఫరాల అధికారులు అంటున్నారు.

సంతోషంగా ఉంది



నూతన రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నా. కొత్త కార్డులు లేకపోవడంతో ఇంత కాలం నిరుత్సాహ పడ్డాం. ప్రభుత్వం కొత్త కార్డులు ఇవ్వడం చాలా సంతోషంగా ఉంది. మధ్యతరగతి కుటుంబాల వారికి ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. ప్రస్తుతం సన్నబియ్యం తీసుకుంటున్నాం.

– అనూష, లబ్ధిదారు, తిమ్మారెడ్డిపల్లి

'పాలమూరు' పూర్తి చేయాలి


కరపత్రం ఆవిష్కరిస్తున్న శుభప్రద పటేల్ తదితరులు

- తెలంగాణ నీటి హక్కులను కాలరాస్తున్న రేవంత్ ప్రభుత్వం
- బీఆర్ఎస్వీ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిశీలకుడు శుభప్రద్ పటేల్

అనంతగిరి: తెలంగాణ నీటి హక్కులను కాలరాస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం బనకచర్లపై ఏర్పాటు చేసిన కమిటీని వెంటనే రద్దు చేయాలని బీఆర్ఎస్వీ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిశీలకుడు శుభప్రద్ పటేల్ డిమాండ్ చేశారు. మంగళవారం వికారాబాద్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, ముఖ్య నాయకుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర హక్కులను కాలరాస్తూ పోలవరం ప్రాజెక్టు నుంచి 200 టీఎంసీల గోదావరి జలాలను రాయలసీమకు తరలించడం కోసం ఏపీ నిర్మించ తలపెట్టిన అక్రమ ప్రాజెక్టు బనకచర్ల అన్నారు. దీనికి గోదావరి, కృష్ణా నదుల యాజమాన్య బోర్డులు, కేంద్రం జల సంఘం అనుమతులు లేకుండా, చర్చ జరగకుండా ప్రాజెక్టు నిర్మించకూడదు. కానీ ఏపీ సీఎం చంద్రబాబు ఇవేవీ లెక్కచేయకుండా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్విభజన చట్టాన్ని తుంగలో తొక్కుతూ బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణానికి సన్నాహాలు చేస్తున్నారన్నారు. ఈ అక్రమ ప్రాజెక్టును అడ్డుకోవాల్సిన బీజేపీ పూర్తి సహకారం అందిస్తోందని ఆరోపించారు. నిధులు కూడా సమకూరుస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ కోట్ల మహిపాల్, వికారాబాద్, చేవెళ్ల, కొడంగల్, తాండూరు, పరిగి ఇన్‌చార్జ్‌లు సురేష్, శాంతికుమార్, శ్రీనివాస్, భాను, రవికుమార్, బాలరాజ్ నాయక్, రవిశంకర్, సిద్దిఖీ, మహేష్, సుభాష్, కృష్ణ, సంతోష్, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

టీబీ వ్యాధిగ్రస్తులు ఆందోళన చెందొద్దు


కొడంగల్ రూరల్: వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

కొడంగల్ రూరల్: టీబీ(క్షయ) వ్యాధిగ్రస్తులు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా వైద్యుల సూచనలు పాటించాలని డాక్టర్లు మహేందర్, నిర్మల, అశ్విని సూచించారు. మంగళవారం మండల పరిధిలోని పర్సాపూర్ గ్రామంలో టీబీ ముక్త్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. ఉచితంగా 121 మందికి టీబీ, ఎక్స్‌రే పరీక్షలు చేశారు. పాత టీబీ పేషంట్లు, ప్రస్తుత టీబీ పేషంట్ల కుటుంబసభ్యులు, పొగాకు, ఆల్కాహాలు వాడేవారికి, బీపీ, షుగర్, హెచ్ఐవీ పేషంట్లు, 60 ఏళ్లు దాటిన వృద్ధులతోపాటు వివిధ రోగాలకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహించారు. టీబీకి 6 నెలలపాటు ఉచిత మందులు అందించనున్నట్లు, పౌష్టికాహారం తీసుకోవడానికి నెలకు రూ.వెయ్యి ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. ఆకలి లేకపోవడం, రెండు వారాలుగా ఎడతెరిపి లేని దగ్గు, బరువు తగ్గడం, ఛాతిలో నొప్పి, చమటలు రావడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే ప్రభుత్వాస్పత్రిలో పరీక్షలు నిర్వహించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీబీ సూపర్‌వైజర్ రాహత్‌అలీ, ఏఎన్ఎం వెంకటమ్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

టీబీ ముక్త్ అభియాన్

పరిగి: టీబీ వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలిని రాపోల్ సబ్ సెంటర్ వైద్యుడు భాస్కరాచారి సూచించారు. మంగళవారం మండల పరిధిలోని రాపోల్ గ్రామంలో టీబీ ముక్త్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దగ్గు, ఛాతిలో నిప్పి, వంటి రుగ్మతలతో బాధపడుతుంటే తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు వెంకటేష్, వైద్య సిబ్బంది రాములు, గోపాల్, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షం.. అతలాకుతలం

పరిగి/దౌల్తాబాద్/బొంరాస్‌పేట: జిల్లా వ్యాప్తంగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు రోడ్లన్నీ జలమయమయ్యాయి. మంగళవారం భారీ వానలకు వాగులు, వంకలు పొంగి పొర్లాయి. రహదారులపై వర్షపు నీరు చేరడంతో వాహనదారులు తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నారు. కాలువలకు వరద నీరు పోటెత్తడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. భారీ వృక్షాలు నేలకొరిగాయి. కొన్ని చోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. లోతట్టు ప్రాంతాలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి.


దౌల్తాబాద్: పారుతున్న చింతల్‌చెరువు


బొంరాస్‌పేట: మూడుమామిళ్లతండాలో పొలానికి గండి కడుతున్న రైతు


దౌల్తాబాద్: తెగిపోయిన నందారం చెరువుకింద కట్ట రోడ్డు